సామాన్యుడి ఆయుధం

ప్రజల అస్త్రం

T/AP/2024/0304/1072/41

తెలుగు దినపత్రిక

ANDHRA PRADESH

పేజీలు : 8

prajalaastram999@gmail.com

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ సంపుటి: 1 సంచిక: 288 పేజీలు: 8 సోమవారం 3 -3-2025 వెల: 5/రూ -



## విలేకరులు కావలెను..

అస్త్రం తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్స్, నియోజకవర్గ ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు కావలెను.. సీనియర్ రిపోర్టర్స్ కి ప్రాధాన్యత ఇవ్వబడును.. మరిన్ని వివరాలకు సంప్రదించండి.

ఎడిటర్. 89193 45606




## యూరప్ దేశాల మల్లగుల్లాలు

లండన్‌లో అధినేతల అత్యవసర భేటీ మూడంచెల వ్యూహం: స్టార్మర్

ఉక్రెయిన్‌కు మరింత ఆర్థిక సాయం అవసరమైతే సైనిక దన్ను కూడా!

యూరప్ భద్రతపై నేతల ఆందోళనలు

2లో


కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే కుమార్తెకు

## పోకిరీల వేధింపులు

- అనుచితంగా ప్రవర్తిస్తూ వీడియోలు తీసిన దుండగులు
- గత నెల 28న మహారాష్ట్రలోని సంత్ ముక్తాయ్ యాత్రలో ఘటన
- ఠాణాలో మంత్రి ఫిర్యాదు.. 2 గంటలు కూర్చోబెట్టిన పోలీసులు
- అమ్మాయి విషయం కావడంతో పునరాలోచించుకోవాలని సూచన
- కేంద్ర మంత్రి కుమార్తెకే రక్షణ లేకపోతే ఎలా అని రక్షా ఖడ్సే ఆవేదన

ముంబై, మార్చి 2: కేంద్ర యువజన, క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే కుమార్తెను పోకిరీలు వే??ధించారు. దీనిపై రక్షా ఖడ్సే స్వయంగా ముక్తాయ్ నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేంద్ర మంత్రినైన తన కుమార్తెకే రక్షణ

- మిగతా 2వ పేజీలో



## అంతరిక్ష పరిశోధనల సంస్థ 'ఫైర్ ఫ్లై ఏరోస్పేస్'

చంద్రుడిపై దిగిన రెండో ప్రైవేటు ల్యాండర్‌గా చరిత్ర

జనవరి 15న ప్రయోగించిన అమెరికన్ ప్రైవేటు



# 'ఎమ్మెల్సీ' ఓట్ల లెక్కింపు నేడే

ఒక ఉపాధ్యాయ, 2 గ్రాడ్యుయేట్ స్థానాలకు గత నెల 27న పోలింగ్

నేటి ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం

మొదటి ప్రాధాన్య ఓటుతో నెగ్గకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ

తదుపరి ప్రాధాన్య ఓటు మేరకు విజేతను ప్రకటించనున్న అధికారులు

ప్రక్రియ పూర్తికి సుదీర్ఘ సమయం.. షిఫ్టుల వారీగా లెక్కింపు సిబ్బంది సిద్ధం

ఏలూరు: రాష్ట్రంలో రెండు గ్రాడ్యుయేట్, ఒక ఉపాధ్యాయ శాసన మండలి స్థానాలకు గత నెల 27న జరిగిన పోలింగ్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతోపాటు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగాయి. రెండు పట్టభద్రుల స్థానాల్లో టీడీపీ

- మిగతా 2వ పేజీలో

# తెలంగాణకు సమస్య మోదీ కాదు.. కిషన్‌రెడ్డి: సీఎం రేవంత్

- ఆయన కన్నా జూనియర్‌గా ఉన్న నేను ఎదిగానని అసూయ
- రాష్ట్రానికి మంచి చేయాలని మోదీకి ఉన్నా.. కిషన్‌రెడ్డి సైంధవుడిలా అడ్డుపడుతున్నారు
- ఏదైనా వస్తే తన ఖాతాలో వేసుకుంటున్నారు
- రాకపోతే రేవంత్ ఏం చేయలేదంటున్నారు
- ఎయిర్‌పోర్టు తెచ్చింది ఆయనే ఐతే.. మూసీ, ఆర్ఆర్ఆర్, మెట్రోలను అడ్డుకున్నదెవరు?
- కేంద్రం వద్ద ఈడీ, సీబీఐ ఉన్నాయని ఎంత కాలం బెదిరిస్తారు? చావు ఓ సారే వస్తుంది



మహబూబ్‌నగర్,: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై మరోసారి విమర్శలతో విరుచుకుపడ్డారు. కేంద్రం నుంచి నిధులు రాకుండా కిషన్‌రెడ్డి సైంధవ పాత్ర పోషిస్తున్నారని, నిత్యం అసూయతో రగిలిపోతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు అహంకారం ఉంటే.. కిషన్‌రెడ్డికి కుళ్లు ఉందని అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో పర్యటించిన ముఖ్యమంత్రి రూ.879.80 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజాపాలన బహిరంగ సభలో మాట్లాడారు. రాష్ట్రానికి నిధులిచ్చి మంచి చేయాలని ప్రధాని మోదీ చూస్తున్నా.. కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని తెలిపారు. తాము కేంద్ర మంత్రుల వద్దకు, ప్రధాన మంత్రి వద్దకు పలుమార్లు వెళ్లి ఏదైనా సాధిస్తే.. కిషన్‌రెడ్డి తానే తెచ్చానంటూ ఖాతాలో వేసుకుంటున్నారని విమర్శించారు. వస్తే తన ఖాతాలోకి, రాకపోతే రేవంత్‌రెడ్డిఏమీ చేయడంలేదని ఆరోపించడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. "నేను కష్టపడి మామునూరు ఎయిర్‌పోర్టుకు అనుమతులు

- మిగతా 2వ పేజీలో



# విమానాశ్రయాలు నిర్మించేది కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రం కాదు

మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను ఎవరు తెచ్చారో ప్రజలకు తెలుసు

మిగులు ఉన్న తెలంగాణ.. కాంగ్రెస్ వచ్చాక అప్పులపాలు ఎలా అయ్యింది?

విమానాశ్రయానికి భూ సేకరణ ఎంత త్వరగా చేస్తారో చూద్దాం!

భూమి ఇస్తే రెండున్నరేళ్లలోనే పూర్తి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

రామప్పకు గుర్తింపు వచ్చినప్పుడే మోదీ ఎయిర్‌పోర్టు హామీ ఇచ్చారు

విమానాశ్రయంతో వరంగల్‌లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: విమానాశ్రయాలను నిర్మించేది ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం భూ సేకరణ మాత్రమే చేస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి కన్ఫ్యూజన్‌లో ఉన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ప్రాజెక్టును రాజకీయం చేయొద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం

## రేవంత్‌కు కనీస మానవ విలువలు లేవు

వైఫల్యాల నుంచి దృష్టి మరల్చే ప్రయత్నం

ఎస్ఎల్‌బీసీ ప్రమాద స్థలానికి వెళ్లకుండా ఎన్నికల రాజకీయాల్లో మునిగి తేలారు

పాలమూరుకు కాంగ్రెస్ చేసిందేంటి?

సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు మండిపాటు





# అక్కాచెల్లెళ్లను మింగేసిన అతివేగం!

ముగ్గురు అక్కాచెల్లెళ్లు సహా పసికందు దుర్మరణం అదే కుటుంబంలో మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

కూడేరు, : మూణ్నెల్ల క్రితం కాన్పు కోసం వచ్చిన చెల్లెలు పండంటి బిడ్డను ప్రసవించింది. నామకరణం కూడా పూర్తయింది. బిడ్డతో సహా చెల్లెల్ని తిరిగి ఆమె అత్తవారింటికి సాగనంపడానికి ఆమె ఇద్దరు అక్కలు, వారి పిల్లలు ఆటోలో సంతోషంగా బయలుదేరారు. అయితే మృత్యువు కారు రూపంలో వచ్చి ముగ్గురు అక్కాచెల్లెళ్లు సహా పసికందును బలితీసుకుంది. అనంతపురం జిల్లా కూడేరు మండలం కమ్మూరు గ్రామ సమీపాన ప్రధాన రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ఈ ఘోరం జరిగింది. మృతుల్లో సరస్వతి (34), నీలావతి(45), యోగేశ్వరమ్మ (40) సొంత అక్కచెల్లెళ్లు. సరస్వతి కుమార్తె మూడు నెలల వయసున్న విద్యశ్రీ కూడా మృతిచెందింది. ఆటో డ్రైవర్ లోకేశ్, మరో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. కూడేరు పోలీసుల కథనం మేరకు.. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన బసవరాజు, పార్వతమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు పుష్పావతి, నీలావతి, యోగేశ్వరమ్మ, సరస్వతి సంతానం. నాలుగో కుమార్తె సరస్వతికి జిల్లాలోని ఉరవకొండ మండలం రాయంపల్లికి చెందిన సతీ–షకుమార్‌తో వివాహమైంది. ఆమె

ప్రజల అస్త్రం

సోమవారం
3-3-2025

# తెలంగాణకు సమస్య మోదీ కాదు.. కిషన్‌రెడ్డి: సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

తెస్తే.. తానే తెచ్చానని కిషన్‌రెడ్డి చెప్పుకుంటున్నారు. అలా అయితే మూసీ ప్రక్షాళనకు, మెట్రో విస్తరణకు, ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల పనులకు, పాలమూరు-రంగారెడ్డికి నీటి కేటాయింపులు, కాళేశ్వరానికి కేటాయింపులు, సమ్మక్క-సారక్క, సీతారామ సాగర్‌లకు నిధులు రాకుండా అడ్డుపడుతున్నది ఆయనేనని భావించాల్సి వస్తుంది" అని రేవంత్ అన్నారు. తాను కిషన్‌రెడ్డి ఒక సందర్భంలో కలిసి పనిచేశామని, ఆయన కంటే చిన్నవాడిని, జూనియర్‌ను అయిన తాను ఎదగడం ఓర్వలేక అసూయతో రగిలిపోతున్నారని ఆరోపించారు. తాను ఈ 14 నెలల కాలంలో 55,163 మందికి ఉద్యోగాలు ఇచ్చానని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ 12 ఏళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణలో కేవలం కిషన్‌రెడ్డికి, బండి సంజయ్‌కు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయన్నారు. వీరిద్దరు కేంద్రం నుంచి చిల్లిగవ్వ తేలేదన్నారు. హైదరాబాద్ అభివృద్ధిపై సమీక్ష కోసం కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ రాకుండా రెండుసార్లు కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని, ఆయన వస్తే సమీక్షకు రాలేదన్నారు. ఈటల రాజేందర్ వచ్చి మేడ్చల్ వరకు మెట్రోను విస్తరించాలని కోరారని తెలిపారు. కేంద్రం దగ్గర ఉన్న సీబీఐ, ఈడీతో ఎంతకాలం బెదిరిస్తారని ప్రశ్నించారు. చావు ఒక్కసారే వస్తుందని వ్యాఖ్యానించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాలకు ముందు కిషన్‌రెడ్డి సమీక్ష పెడితే తెలంగాణ ఎంపీలంతా వచ్చి ప్రతిపాదనలు ఇస్తారని, వాటి ప్రకారం నిధులు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. కృష్ణానదిలో 811 టీఎంసీల నీటిలో ఏపీకి 512 టీఎంసీల కేటాయింపును సమర్థిస్తూ కేసీఆర్ పెట్టిన సంతకం తెలంగాణకు యమపాశమైందని అన్నారు. ఆనాడు పోతిరెడ్డిపాడు పొక్క పెంచుకోవడానికి తండ్రి వైఎస్‌ఆర్‌కు, స్వరాష్ట్రం ఏర్పడ్డాక రాయలసీమ లిఫ్టుకు పునాది వేసి కొడుకు జగన్‌కు కేసీఆర్ సాయం చేశారని ఆరోపించారు. పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్.. కాంగ్రెస్ హయాంలో 32 కిమీలు పూర్తయిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను వదిలేశారని మండిపడ్డారు. రోజా ఇంటికి వెళ్లి రొయ్యల పులుసు తిని.. రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పి లిఫ్టుకు కర్త, కర్మ, క్రియగా మారారని ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డ సీఎం అయితే ఓర్వలేక ఏడాది కాకముందే దిగిపోవాలంటున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేస్తున్న, చేసిన పనులను బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మనఃసాక్షితో చూడాలని సీఎం రేవంత్ అన్నారు. 25.50 లక్షల మందికి రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, కేసీఆర్ ఎగవేసిన రైతుబంధు సాయం రూ.7,627 కోట్లు ఇచ్చామని, కోతలు లేకుండా విద్యుత్తు అందిస్తున్నామని చెప్పారు. అలాగే 50 లక్షల మందికి 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు ఇస్తున్నామని వివరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ సబ్‌ప్లాన్, బీసీ కార్పొరేషన్, ట్రైబల్ కార్పొరేషన్, మైనారిటీ కార్పొరేషన్‌లను పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా వివిధ కార్పొరేషన్ల కింద స్వయం ఉపాధి పథకాలకు రూ.6 వేల కోట్లు అందజేస్తామని చెప్పారు.

కేటీఆర్, హరీశ్‌రావు సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని, గడీని దాటి బయటకు రాలేని కేసీఆర్ వీరిద్దరితో మాట్లాడిస్తున్నారని భట్టివిక్రమార్క మండిపడ్డారు. రెండో విడత రైతు భరోసా మార్చి 31లోపు జమ చేస్తామని అన్నారు. కాగా, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పదేళ్లు నిర్లక్ష్యం చేసి.. అనుకోని ప్రమాదం జరిగితే బీఆర్ఎస్ నేతలు ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి అర్బన్: ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి, రేవంతన్న భరోసా పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 50మంది ముస్లింమహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ పథకం కింద రాష్ట్రంలో రూ.36.64 కోట్లతో 42 వేల 230 మందికి మైనారిటీ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. వనపర్తి పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి తాను చదువుకునే రోజుల్లో అద్దెకు ఉన్న ఇంటికి వెళ్లారు.

# రేవంత్‌కు కనీస మానవ విలువలు లేవు

హైదరాబాద్,: సీఎం రేవంత్‌రెడ్డి తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రతిపక్షంపై ఆరోపణలు చేయడాన్ని అలవాటుగా చేసుకున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కర్తవ్యం మరిచి ఎన్నికల రాజకీయాల్లో మునిగితేలిన ముఖ్యమంత్రి.. తాను తన స్నేహితుడి కూతురి పెళ్లికి అబుదాబికి వెళ్లడాన్ని కూడా వివాదం చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇది రేవంత్ నీచత్వానికి పరాకాష్ఠ అని ధ్వజమెత్తారు. ఈ మేరకు హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద స్థలానికి వెంటనే వెళ్లకుండా బాధ్యత మరిచి ఎన్నికల ప్రచారానికి ప్రాధాన్యమిచ్చారని, తొమ్మిది రోజుల తరువాత వెళ్లి ఇప్పుడు బీఆర్ఎసపై, తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అబుదాబికి వెళ్లింది క్రికెట్ మ్యాచ్‌లు చూడడానికో, విహారయాత్రలకు, విలాసాలకో కాదని, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బిడ్డ పెళ్లికి హాజరయ్యేందుకు వెళ్లానని తెలిపారు. తాను ఫిబ్రవరి 21న వెళితే.. ప్రమాద ఘటన ఆ నెల 22న జరిగిందన్నారు. ప్రమాద స్థలానికి వెళ్లడానికి హెలికాప్టర్ లేదనే కారణంతో ఇరేషన్ మంత్రి అక్కడకి పోకుండా హైదరాబాద్‌లో ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వంలో ఉండి కూడా బాధ్యత మరచి, కనీస మానవ విలువలు పాటించకుండా ప్రవర్తించిన వారు.. తనను ఆడిపోసుకుంటున్నారని అన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా తాను బాధ్యతాయుతంగా వ్యవహరించానని తెలిపారు. ప్రమాదం జరిగి 9 రోజులు గడిచినా కార్మికులను కాపాడకపోగా, కనీసం వారి మృతదేహాలను బయటకు తీయలేని చేతగాని ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోరుంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే చెల్లదని హెచ్చరించారు. ముఖ్యమంత్రిగా శాంతిభద్రతలపై దృష్టి సారించకుండా.. ప్రతిపక్ష నాయకుల కదలికలను తెలుసుకోవడానికి ఇంటెలిజెన్స్ వ్యవస్థను ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి పదే పదే పాలమూరు బిడ్డనని శుష్క సెంటిమెంట్‌ను వల్లించడం తప్ప పాలమూరుకు ఒరగబెట్టిందేమీ లేదని హరీశ్‌రావు అన్నారు. వనపర్తిలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఒక ప్రకటనలో స్పందిస్తూ.. కేసీఆర్‌ను తిట్టడం తప్ప ప్రజలకు పనికొచ్చే విషయం ఒక్కటి కూడా రేవంత్‌రెడ్డి మాట్లాడడం లేదన్నారు. "కేసీఆర్‌ను, బీఆర్ఎసను విమర్శించడం కాదు.. కృష్ణాజలాలను అక్రమంగా తరలించుకుపోతున్న ఏపీ చర్యలకు అడ్డుకట్ట వేయి. నీటికోసం చంద్రబాబుపై యుద్ధం ప్రకటించు. మేం పక్క రాష్ట్ర ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక సంబంధాలు నెరిపాం.



# యూరప్ దేశాల మల్లగుల్లాలు

లండన్: అధినేతలు డొనాల్డ్ ట్రంప్, జెలెన్‌స్కీ వాగ్యుద్ధంతో అమెరికా, ఉక్రెయిన్ సంబంధాలు అకస్మాత్తుగా దెబ్బతిన్న వైనం యూరప్‌ను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. వాటిని తిరిగి చక్కదిద్దే మార్గాల కోసం అవి మల్లగుల్లాలు పడుతున్నాయి. ఈ అంశంపై చర్చించేందుకు యూరప్ దేశాధినేతలు ఆదివారం లండన్లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇందుకు బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ చొరవ తీసుకున్నారు. 'సురక్షిత యూరప్ కోసం' పేరిట జరిగిన ఈ శిఖరాగ్ర సమావేశంలో చర్చంతా అమెరికా, ఉక్రెయిన్ సంబంధాల చుట్టే తిరిగినట్టు సమాచారం. ఉక్రెయిన్‌కు మరిన్ని నిధులు అందించాలని నేతలు నిర్ణయానికి వచ్చారు. అవసరమైతే యూరప్ దేశాలన్నీ తమ సైన్యాన్ని కూడా ఉక్రెయిన్‌కు పంపేందుకు సిద్ధంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ కీలక భేటీలో జెలెన్‌స్కీతో పాటు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కూడా పాల్గొన్నారు. యూరప్ భద్రత కోసం ఖండంలోని దేశాలన్నీ ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరముందని స్టార్మర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇలాంటి అవసరం, అవకాశం తరానికి ఒక్కసారి మాత్రమే వస్తాయని అన్నారు. "రష్యా బారి నుంచి ఉక్రెయిన్‌కు శాశ్వత రక్షణ కల్పించాలి. యూరప్‌లోని ప్రతి దేశం భద్రతకూ ఇది చాలా కీలకం" అని చెప్పారు. "ఇందుకు మూడంచెల మార్గముంది. ఉక్రెయిన్‌ను సాయుధంగా పటిష్టపరచాలి. దాని భద్రతకు యూరప్ మొత్తం పూచీగా ఉండాలి.

## అక్కాచెల్లెళ్లను మింగేసిన అతివేగం!

(మొదటిపేజీ తరువాయి)

మూడు నెలల క్రితం కాన్పు నిమిత్తం పుట్టింటికి వచ్చి బిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పుడా పాప(విద్యశ్రీ)కు మూడు నెలలు. ఆదివారం తిరిగి అత్తవారి గ్రామానికి సరస్వతి బయల్దేరింది. ఆమె వెంట నీలావతి, యోగేశ్వరమ్మ, వారి పిల్లలు అచ్యుత్‌కుమార్, జ్ఞానేశ్వరి కూడా రాయంపల్లికి చెందిన లోకేశ్ ఆటోలో బయల్దేరారు. కూడేరు మండలం కమ్మూరు గ్రామ సమీపంలోకి రాగానే ఉరవకొండ నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో బాలింత సరస్వతి అక్కడికక్కడే మృతిచెందింది.

# విమానాశ్రయాలు నిర్మించేది కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రం కాదు

(మొదటిపేజీ తరువాయి)



లేకపోవడం వల్లే మామునూరు విమానాశ్రయం ఆలస్యమైందని రామ్మోహన్ ఆరోపించారు. ఆదివారం కవాడిగూడలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితో కలిసి రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. 'మామునూరు ఎయిర్‌పోర్టును ఎవరు తీసుకొచ్చారో ప్రజలకు తెలుసు. అందుకే దీన్ని వారికే వదిలేద్దాం' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ.. అప్పులపాలు ఎలా అయ్యిందో సీఎం రేవంత్ సమాధానం చెప్పాలన్నారు. 'ప్రజలకు ఇచ్చిన హామీలను ముందు అమలు చేయండి. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. మేం మాట ఇచ్చాం. అందుకు అనుగుణంగా వరంగల్ ఎయిర్‌పోర్టును ఇస్తున్నాం. దానికి ఎంత తొందరగా భూసేకరణ చేస్తారో చూద్దాం' అని రామ్మోహన్ అన్నారు. మామునూరు విమానాశ్రయాన్ని కొచ్చి విమానాశ్రయం తరహాలో తీర్చిదిద్దాలంటూ సీఎం రేవంత్ అధికారులను ఆదేశించడంపై స్పందిస్తూ రామ్మోహన్ ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు తెలంగాణ రాష్ట్రాన్ని ఆగం చేశాయని ఆరోపించారు. తెలంగాణను ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని వెల్లడించారు. ఇక్కడ ఏరో స్పేస్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తే స్థానికులకు ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. విమానాలను మనదేశంలోనే తయారు చేసుకోవాలన్నది ప్రధాని మోదీ సంకల్పమని, అలాంటి పరిశ్రమను హైదరాబాద్ సమీపంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని రామ్మోహన్ చెప్పారు. మామునూరు విమానాశ్రయం రన్‌వేకు అవసరమైన 280 ఎకరాల భూమి ని అప్పగిస్తే.. రెండున్నరేళ్లలోనే ఎయిర్‌పోర్ట్ పను లు పూర్తిచేస్తామన్నారు. విమానాశ్రయాన్ని అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించేందుకు మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. వరంగల్‌లో ప్రస్తుతం ఎయిర్‌పోర్టు అథారిటీ అధీనంలో ఉన్న 696 ఎకరాల్లో గతంలో ఆసియా ఖండంలోనే (దేశానికి స్వాతంత్ర్యం రాకముందు) అతిపెద్ద విమానాశ్రయం ఉండేదన్నారు. హైదరాబాద్%-%శ్రీశైలం సీ ప్లేన్ ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వారధిగా పనిచేస్తున్నారని చెప్పారు. ఉడాన్ యాత్రికన్ కెఫేను హైదరాబాద్ విమానాశ్రయంలోనూ అందుబాటులోకి తెస్తామన్నారు. దీంతో రూ.10కే టీ, కాఫీ, మంచినీటి సీసా, స్వీటు రూ.20కి దొరుకుతాయ న్నారు. దేశవ్యాప్తంగా అన్ని మెట్రో నగరాల్లో రెండో విమానాశ్రయం అందుబాటులోకి వస్తోందని.. బేగంపేట విమానాశ్రయం కూడా భవిష్యత్తులో మరింత వినియోగంలోకి వస్తుందని చెప్పారు.

# కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే కుమార్తెకు వేధింపులు

(మొదటి పేజీ తరువాయి)

లేకపోతే సామాన్యులకు ఎలా అని ఆమె వాపోయారు. మహారాష్ట్ర జల్‌గావ్ జిల్లాలోని ముక్తాయ్‌నగర్‌లో గత నెల 28న మహాశివరాత్రి సందర్భంగా సంత్‌ముక్తాయ్ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో పాల్గొంటానని కుమార్తె కోరడంతో గుజరాత్ పర్యటనలో ఉన్న తాను సెక్యూరిటీనిచ్చి పంపినట్లు రక్షా ఖడ్సే తెలిపారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా ఆకతాయిలు లెక్కచేయలేదు. రక్షా ఖడ్సే కుమార్తెను, ఆమె స్నేహితులను ఏడుగురు పోకిరీలు వెంబడించి వేధించారు. అనుచితంగా ప్రవర్తిస్తూ ఫొటోలు, వీడియోలు తీశారు. ఈ యువకులే గత నెల 24న కూడా తనను వేధించారని కుమార్తె చెప్పడంతో కేంద్ర మంత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదు చేసేందుకు వెళ్లినప్పుడు 2 గంటల పాటు పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టిన పోలీసులు... అమ్మాయిల విషయం కావడంతో కేసు పెట్టే విషయంలో పునరాలోచించుకోవాలని సూచించినట్లు రక్షా ఖడ్సే మామ ఏక్‌నాథ్ ఖడ్సే తెలిపారు. నిందితులపై గతంలోనూ అనేక ఫిర్యాదులు వచ్చినా పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. ఎట్టకేలకు పోలీసులు నిందితులపై పోక్సో, ఐటీ చట్టాల కింద కేసు నమోదు చేసి సోహమ్ అనే ఆకతాయిని అరెస్ట్ చేశారు.

# 'ఎమ్మెల్సీ' ఓట్ల లెక్కింపు నేడే

(మొదటిపేజీ తరువాయి)

నాయకులతోపాటు పదుల సంఖ్యలో అభ్యర్థులు పోటీ చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయస్థానంలో ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మకు కూటమి మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో మూడు స్థానాల్లోనూ ఎన్నికల పోరు సాధారణ ఎన్నికలను తలపించింది. సోమవారం జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌కు ఆయా జిల్లాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే, ఈ లెక్కింపు ప్రక్రియ రోజురోజంతా జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**ఓట్ల లెక్కింపు క్లిష్టం**

పట్టభద్రుల ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు మాత్రమే వినియోగించారు. నిబంధనల ప్రకారం పోలైన ఓట్లలో చెల్లనివి పక్కన పెడతారు. మిగిలిన ఓట్లలో 50 శాతం పైబడి మొదటి ప్రాధాన్య ఓటు ఏ అభ్యర్థికి లభిస్తుందో.. వారినే విజేతగా ప్రకటిస్తారు. ఒకవేళ మొదటి ప్రాధాన్య ఓటు మార్కును చేరుకోకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభిస్తారు. రెండో ప్రాధాన్య ఓటుని లెక్కిస్తారు. అప్పుడు కూడా సగం కంటే తక్కువగా ఉంటే తర్వాతి ప్రాధాన్య ఓటును పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థుల గెలు పు, ఓటముల్లో మొదటి ప్రా?ధాన్యత ఓటుతో పాటు ఇతర ప్రాధాన్యతా ఓట్లు కూడా కీలకమవుతాయి. ప్రాధాన్యతా ఓట్లను బట్టి ఫలితం నిర్దేశించాల్సి ఉన్నందున ఈ ప్రక్రియలో జాప్యం తప్పకపోవచ్చని భావించి ఆ మేరకు షిప్టుల వారీగా లెక్కింపు సిబ్బందిని సిద్ధం చేశారు. ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గంలో టీడీపీ పక్షాన పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవుల మధ్య పోటీ నువ్వా-నేనా అన్నట్లుగా ఉంది. స్వతంత్ర అభ్యర్థులు కూడా బలమైన పోటీ ఇస్తున్నారు. 2,18,902 ఓట్లు పోలయ్యాయి. ఏలూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రక్రియ గుంటూరులోని ఏసీ కళాశాలలో జరగనుంది. 2,41,502 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**సాయంత్రానికే ఉత్తరాంధ్ర ఫలితం!**

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఓట్ల లెక్కింపు ప్రక్రియ విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో జరగనుంది. మొత్తం 22,493 మంది ఓటర్లు ఉండగా 20,794 మంది(92.45 శాతం) ఓటు వేశారు. తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో ఫలితం తేలితే సాయంత్రం 6 గంటల తర్వాత విజేత పేరు ప్రకటిస్తారు.

# అంతరిక్ష పరిశోధనల సంస్థ 'ఫైర్ ఫ్లై ఏరోస్పేస్'

న్యూయార్క్, మార్చి 2: చందమామపై దాదాపు ఏడాది వ్యవధిలోనే రెండో ప్రైవేటు ల్యాండర్ దిగింది! అమెరికాకు చెందిన ఫైర్ ఫ్లై ఏరోస్పేస్ అనే ప్రైవేటు అంతరిక్ష సంస్థకు చెందిన 'బ్లూ ఘోస్ట్' ల్యాండర్.. నాసాకు చెందిన 10 శాస్త్ర, సాంకేతిక పరికరాలతో ఆదివారం విజయవంతంగా ల్యాండయింది. దాదాపు 6.6 అడుగుల ఎత్తు, 11 అడుగుల వెడల్పున ఉండే ఈ ల్యాండర్‌ను జనవరి 15న కేప్‌కెనవరాల్ (ఫ్లోరిడా)లోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించారు. చందమామపై నిర్ణీత ల్యాండింగ్ సైట్‌కు 328 అడుగుల పరిధిలోనే ఇది ల్యాండ్ అయినట్టు ఫైర్‌ఫ్లై సంస్థ ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. చంద్రుడిపై దిగిన అరగంట తర్వాత.. బ్లూ ఘోస్ట్ అక్కడి చిత్రాలు తీసి భూమికి పంపడం ప్రారంభించింది. బ్లూఘోస్ట్ ద్వారా చంద్రుడిపైకి 10 పరికరాలను పంపడానికి నాసా 101 మిలియన్ డాలర్లు (దాదాపుగా రూ.883.45 కోట్లు).. ఆ పరికరాల తయారీకి 44 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.385 కోట్లు) ఖర్చు చేసింది. ఆ పరికరాలతో చందమామపై బ్లూ ఘోస్ట్ రెండువారాలపాటు (చంద్రుడిపై 15 రోజులు పగలు ఉంటుంది) పరిశోధనలు చేయనుంది. కాగా.. అమెరికాకే చెందిన 'ఇంట్యూటివ్ మెషీన్స్' అనే ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థ ప్రయోగించిన మరో ల్యాండర్ 'ఎథెనా'.. నిర్ణీత షెడ్యూలు ప్రకారం గురువారం చంద్రుడిపై ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, అది చంద్రుడి దక్షిణ ధ్రువానికి 100 మైళ్ల పరిధిలో ల్యాండ్ కానుంది. ఆ సంస్థ గత ఏడాది ఫిబ్రవరి 22న.. 'ఒడిసస్' అనే ల్యాండర్‌ను చందమామపై దించి, ఆ ఘనత సాధించిన తొలి ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థగా చరిత్ర సృష్టించింది. అయితే, ల్యాండింగ్ సమయంలో ఒడిసస్ రేంజింగ్ లేజర్ల పనితీరు దెబ్బతిని, దాని కాళ్లలో ఒకటి విరిగి, సమతౌల్యం తప్పి కిందపడిపోయింది. అయినప్పటికీ బలహీనంగానైనా సంకేతాలను భూమికి పంపింది. దాంతో పోలిస్తే బ్లూఘోస్ట్ ఎలాంటి సమస్యలూ లేకుండా చక్కగా ల్యాండయింది. అందుకే.. సాంకేతికంగా దీన్నే చంద్రుడిపై సజావుగా ల్యాండయిన తొలి ప్రైవేటు ల్యాండర్‌గా భావించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సామాన్యుడి ఆయుధం
T/AP/2024/0304/1072/41
3
అస్త్రం
ప్రజల
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
ప్రకాశం - బాపట్ల
సోమవారం 3 -3-2025



## శిలాఫలకాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు: తీసుకోవాలి

### స్థానిక పోలీస్ స్టేషన్ లో వైసీపీ నాయకులు ఫిర్యాదు

దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : మండలంలో గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆగంతకులు ధ్వంసం చేసిన విషయంపై పోలీసులు స్పందించి, ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని గుర్తించి, తగు చర్యలు తీసుకోవాలని మండల వైసీపీ అధ్యక్షుడు బూరె బాబురావు స్థానిక నాయకులతో కలిసి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ధ్వంసమైన శిలాఫలకాలను పునర్నిర్మించాలని వైసీపీ శ్రేణులు కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో స్థానిక వైసీపీ నాయకులు వరదపు రెడ్డి లలితా నాయుడు, కె.వి రమణ, కె. ఎం పాలెం సర్పంచ్ గంధం రామకృష్ణ, వరదపు రెడ్డి వెంకటరమణ, గంగ వంశం సంతోష్ తదితరులు ఉన్నారు.

## అభయ ఆంజనేయ స్వామికి భూమి పూజ



సింగరాయకొండ: అస్త్ర ప్రతినిధి: ప్రకాశం జిల్లా,సింగరాయకొండ మండలం, సోమరాజుపల్లి లోని హరిజనవాడ లో రామాలయం వద్ద శ్రీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఉదయం 10:30 ని " లకు ఘనంగా నర్వహించారు.విగ్రహ దాతలు డాఎం బిళ్ళా బ్రహ్మయ్య-ఆశ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భూమి పూజ చేశారు. ఈ సందర్బంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ ఈ కాలనీలో అత్యధికులు వ్యవసాయం, వడ్రంగి వృత్తులు పై ఆధారపడి జీవనం సాగిస్తారని, దశాబ్దాల క్రితం ఈ ఆలయంలో సీతా, రామ, లక్ష్మణుల "దారువిగ్రహాలు" స్థానికులే(బొడ్డు అంకులు )తయారు చేసి ప్రతిష్ట చేశారని నేడు అభయ ఆంజనేయ స్వామి వారి విగ్రహం కూడా స్థానిక కళాకారుడు దేవా చేతిలో రూపు దిద్దుకుంటోంది అని తెలియజేసారు. కార్యక్రమంలో స్థానిక యువతీ యువకులు గ్రామ ప్రజలు, భక్తులు, సమరసత సేవా ఫౌండేషన్ కార్యకర్తలు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

## రెండు పూరీల్లు దగ్ధం భారీగా ఆస్తి నష్టం

చీడికాడ అస్త్రం ప్రతినిధి : మండలంలోని తురువోలు లో అగ్ని ప్రమాదం జరిగి రెండు పూరీల్లు దగ్ధం కాగా సుమారు రెండు లక్షల ఆస్తి నష్టం జరిగింది. సంఘటనకు సంబంధించి గ్రామానికి చెందిన టిడిపి అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు అర్జున్ లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమ గ్రామానికి చెందిన కంచి పాటి రాము, చౌక్కాకుల భగవంతులు, నివాసగృహం లోనే టీ టిఫిన్ దుకాణం, కిల్లిబడ్డి ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారన్నారు. ఆదివారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో ప్రమాదవశత్తు మంటలు చెలరేగి రెండు పూరీల్లు దగ్ధం అయ్యి సర్వస్వం కాలి బూడిదయిందన్నారు. అర్ధరాత్రి కావడంతో మంటలను అదుపు చేయడం కష్టతరమైందని, బాధితులు బయటకు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారని వారు తెలిపారు. తమకు చెందిన రేషన్ కార్డులు ఆధార్ కార్డులు విలువైన పత్రాలు అన్ని అగ్నికి ఆహుతయ్యాయన్నారు.ఈ విషయమై అధికారులకు తెలియజేయడం జరుగుతుంధని,ప్రభుత్వపరంగా పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.






# దేవాదాయ శాఖ భూమి పరిరక్షణ కత్తిమీద సామేనా?

## ఎవరి భూమికి ఎవరు హక్కుదారులు ?

## హెచ్చరిక బోర్డు లతో దోబూచులాట ఎంతకాలం?

విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నా ప్రొసెస్ ఆఫ్ లా అంటున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు.

దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులు తొలగించినా చట్టపరమైన చర్యలు ఏవి?

ఎఫై ఆర్ నమోదు కి నోచుకోని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఫిర్యాదులు.



సింగరాయకొండ అస్త్రం న్యూస్ ప్రతినిధి: దాతలు, భక్తులు శ్రీ శ్రీ యోగానంద లక్ష్మీ నారసింహ క్షేత్రం శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీ నారసింహ స్వామి వారి నిత్య కైంకర్యాలు, ఆలయ అభివృద్ధి, పోషణ కొరకు ఇచ్చిన భూములను కాపాడాల్సిన దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఎవరికి తోచిన విధంగా వారు భాధ్యత రహితంగా వ్యవహరించడం ఫలితం భూములు అన్యాక్రాంతం కావడానికి దారితీశాయి అన్న విషయం తెలిసిందే. దక్షిణ సింహాచలం గా పేరు పొందిన శ్రీ శ్రీ శ్రీ యోగానంద లక్ష్మీ నారసింహ క్షేత్రం శ్రీశ్రీశ్రీ యోగానంద లక్ష్మీ నారసింహ స్వామి దేవస్థానం నిర్వహణ పర్యవేక్షణ చేసే సిబ్బంది, అధికారుల నిర్వాకం ఇక్కడ చెప్పుకోదగిన విషయం. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాత సింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలో వెంచేసిన స్వామి వారికి ప్రకాశం, నెల్లూరు తోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వేల ఎకరాల భూములు ఉన్నాయి. వాటి పర్యవేక్షణ పరిరక్షణ చెయ్యాల్సిన దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు అధికార పార్టీ నాయకుల మన్ననలు పొందుతూ భూముల పరిరక్షణని పూర్తిగా వదిలేశారని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. దేవస్థానం లో విశేష ఉత్సవాలు, కార్యక్రమాలు, బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాలు నిర్వహించేందుకు వేల ఎకరాలు భూములు ఉన్నప్పటికీ దేవస్థాన పాలక మండళ్ళు, కార్యనిర్వహణ అధికారి, దేవస్థాన అర్చక స్వాములు ఎప్పటి కప్పుడు భక్తుల విరాళాల తో నిరహించడం ప్రతి ఒక్కరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. గతం లో ప్రతి సంవత్సరం దేవాలయ భూములు ఇతర వనరుల ద్వారా 25 లక్షలు ఆదాయం వచ్చేవిధంగా ఒక పద్ధతి తీసుకువచ్చిన్నట్లు భక్తులు చెప్తుంటారు. కానీ గత నాలుగైదు సంవత్సరాలుగా ఈ పరిస్థితి కి భిన్నంగా పరిస్థితి ఉందంటే ఆశ్చర్యం లేదు. ఆర్జేసి స్థాయి అధికారి పర్యవేక్షణ పరిధిలో ఉండాల్సిన దేవస్థానం కనీసం సిబ్బంది నియామకానికి కూడా దిక్కులేకుండా ఉంది. దేవస్థాన కార్యకలాపాలు నిర్వహిస్తున్న అధికారికి కనీసం అటెండర్ కూడా లేరంటే ఇక భూముల ద్వారా రైతుల నుండి దేవస్థానానికి రావలసిన సొమ్ము ఎలా వసూలు చేయడం కుదురుతుంది అనేది జిల్లా అధికారులు ఆలోచించాల్సి ఉంది. సిబ్బంది నియామకం ప్రకారం కార్యనిర్వహణ అధికారి తో పాటు సిబ్బంది గా అటెండర్, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్ట్ లో సిబ్బంది ఉండాలి.కానీ రెండు సంవత్సరాలకు పైగా ఈ దేవస్థాన కార్యనిర్వహణ అధికారి కార్యాలయం లో సిబ్బంది ఖాళీలు భర్తీ చేయడం లో జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దేవాలయ అభివృద్ధికి తీరని నష్టం అని భక్తులు ఆవేదన చెందుతున్నారు. సిబ్బంది లేకుండా సింగరాయకొండ, ఇతర ప్రాంతాల లో దేవస్థానం భూమి పరిరక్షణ కత్తిమీద సాములా తయారయింది. ఎవరికి దొరికినది వారు ఆరగించడం,భక్తుల విరాళాల అవకతవకలకు పాల్పడడం, విలువైన భూములు అన్యాక్రాంతం, దురాక్రమణకు గురవుతున్నా వాటిని అరికట్టి దేవాదాయ ధర్మాదాయ శాఖ స్వాధీనం చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది. సింగరాయకొండ, మూలగుంట పాడు, సోమరాజు పల్లి గ్రామ పంచాయితీల పరిధిలో కొంత కాలంగా దేవాదాయ సర్వీస్ భూమి అన్యాక్రాంతం అయినా వాటిని పరిరక్షించాల్సిన అధికారులు కేవలం హెచ్చరిక బోర్డు ఏర్పాటు కె పరిమితం కావడం విమర్శలకు దారి తీస్తుంది. గత కొద్ది నెలలుగా ఓవి రోడ్డు లో సింగరాయకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న సర్వే నంబరు 607 వేద

పారాయణ సర్వీస్ ఇమామ్ 2.98 ఎకరాల భూమి లో దేవాదాయ ధర్మాదాయ శాఖ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసింది. దాని పై ఉన్న యథాతథ స్థితి ఆదేశాలు రద్దు చేయించే ప్రయత్నాలు కన్పించడం లేదని చెప్పడం లో ఆశ్చర్యం లేదు. అదే విధంగా సోమరాజుపల్లి గ్రామ పంచాయితీ పరిధి లోని దేవుడి బాట లో పార్వేట జరిగే భూమి సర్వే నంబర్ 353 లోని 3 ఎకరాలు భజంత్రీ మాన్యం, అదే విధంగా సింగరాయకొండ ట్రంక్ రోడ్డు ప్రస్తుత మార్కెట్ సెంటర్ మసీదు రోడ్డు పక్కన గల సర్వే నంబరు 605/ ఎ లోని 12 సెంట్లు, రెండు సెంట్లు భూమి అన్యాక్రాంతం అయి దురాక్రమణకు గురైనట్లు జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు గుర్తించి స్తానిక కార్యనిర్వహణ అధికారి చేత దేవస్థానం భూమి అని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం ఆక్రమణలకు గురైనట్లు మీడియా ఏకరువు పెట్టింది. స్థానిక ప్రజలు జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. ఈ భూములకు సంబంధించి హక్కుదరులుగా ప్రకటించుకుంటున్న వారు న్యాయం చెయ్యాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ చర్యలను నిలిపి వేసి తమకు హక్కు కల్పించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సింగరాయకొండ లోని అన్ని భూములు దేవాదాయ ధర్మాదాయ శాఖ వే అయినప్పటికీ ఆ భూములలో దశాబ్దాలుగా ప్రజలు పక్కా శాశ్వత నిర్మాణాలు చేపట్టి అనుభవిస్తున్నారని చర్యలు తీసుకోవాల్సి వస్తే అన్నిటి పైన తీసుకోవాల్సి వస్తుందని స్థానిక దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేసిన, దేవాదాయ శాఖ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరితే మీరు న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆదేశాలు తెస్తే ఆభూముల ఆక్రమణల నుండి కాపడగలమని ఉచిత సలహా ఇస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వత్తిడులు, సిఫారసులు, ఆక్రమణ దారుల చర్యలు ఎదుర్కొని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు స్వామి వారి భూములను ఏమేరకు కాపాడుతారో అని ప్రజలు భక్తులు ఎదురు చూస్తున్నారు.

4
సామాన్యుడి ఆయుధం
T/AP/2024/0304/1072/41
అస్త్రం
ప్రజల
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
ప్రకాశం - బాపట్ల
సోమవారం 3 -3-2025



# ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు మౌన దీక్ష

### సంఘీభావం తెలిపిన ధర్మశ్రీ

**చోడవరం, అస్త్రం ప్రతినిధి :** మూడేళ్ల క్రితం తనను ప్రేమించి తాళి కట్టి ఒక బిడ్డకు తల్లిన చేసిన తర్వాత  ముఖం చాటేస్తున్న ప్రియుడు ఇంటి ముందు బాధితురాలు మౌన దీక్ష చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం అటుగా వెళుతున్న ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ దీక్షశిబిరం వద్దకు వెళ్లి జరిగిన విషయం తెలుసుకొని ఆమెకు  న్యాయం చేయాలని కోరుతూ వెంటనే సర్కిల్ ఇన్స్పెక్టర్ తో ఫోన్లో మాట్లాడారు. వివరాలు పరిశీలిస్తే చోడవరం మారుతి నగర్ కి చెందిన మొల్లి నూక రత్నం చోడవరంలో గల ఒక వస్త్ర దుకాణంలో పనిచేస్తుంది. అయితే ఆ దుకాణానికి ఎదురుగా ఒక బైక్ మెకానిక్ షాప్ కూడా ఉంది. కొమోజు సతీష్ అనే వ్యక్తి బైక్ మెకానిక్ చేస్తూ ఆమెతో పరిచయం పెంచుకొని ప్రేమించాడు. మూడు సంవత్సరాలుగా వారిద్దరి మధ్య సంబంధం కొనసాగుతుంది. ఈమెకు గతంలో వివాహమై భర్త కూడా మృతి చెందాడు. జీవనోపాధి నిమిత్తం వస్త్ర దుకాణంలో చేరడంతో ఇద్దరు మధ్య ప్రేమ పుట్టుంది. దీంతో ఈమెను ఒక ఇల్లు తీసి ఇంట్లో ఉంచాడు. అయితే మూడు మాసాల క్రితం ఈమెకు బిడ్డ పుట్టాడు. అప్పటినుంచి మొహం చాటేస్తున్నాడని ఆమె వాపోతుంది. ఫోన్ చేసిన ఎత్తడం లేదని ఇంటికి రావడం లేదని ఆసుపత్రి వారు ఆధార్ కార్డు అడిగితే ఇవ్వడంలేదని చెబుతూ తనకు డబ్బు కూడా ఆస చూపేరని కానీ తన బిడ్డకు తండ్రి కావాలని తన కోరుతున్నామని ఆమె తెలిపింది. ఈ మేరకు పోలీసులు కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. నేపథ్యంలో ఆదివారం తనకు న్యాయం చేయాలంటూ ప్రియుడి ఇంటి ముందు ఆమె మౌన దీక్ష చేపట్టగా ధర్మ శ్రీతో పాటు జడ్పిటిసి శ్రీకాంత్, వైసిపి నాయకులు దేవరపల్లి సత్య తదితరులు దీక్ష శిబిరం వద్దకు వెళ్లి ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పడంతో పాటు పోలీసు వారితో కూడా మాట్లాడారు.ఆమెకు న్యాయం చేయాలని ధనశ్రీ కోరుతున్నారు.

# మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు





చంద్రశేఖరపురం అస్త్రం ప్రతినిధి మండలంలోని, ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ మిట్టపాలెం నారాయణస్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. , దేవస్థానం కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహా బాబు,ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ  ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం పంచద్రవ్యములతో పంచామృత అభిషేకం, గోవు పూజా కార్యక్రమం, మహా నివేదన కార్యక్రమం, మహా అన్నదాన కార్యక్రమం, రాత్రికి పల్లకి సేవ రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ నారాయణస్వామి వారి కుటుంబ సభ్యులు కొమ్మినేని వెంకట్రావు, దేవాలయ సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గిరిజనుల కోసం ఉచిత మెడికల్ క్యాంప్

## ఉచిత మెగా మెడికల్ క్యాంపు కు విశేష స్పందన





**యర్రగొండపాలెం : అస్త్రం న్యూస్ :**మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామం అంకమ్మగూడెంలో ముస్లిం యూత్ సొసైటీ ఆధ్వర్యంలో కర్నూలు శాంతిరాం ఐ హాస్పిటల్ వారిచే  గిరిజనుల కోసం ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది.సొసైటీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ముస్లిం యూత్ సొసైటీ అనే సంస్థను కులమతాలకు అతీతంగా  సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ముఖ్యంగా గిరిజనుల కోసం ఇలాంటి కార్యక్రమం చేయడం చాలా సంతోషంగా ఉందని ఎంతో ఖరీదైన వైద్యాన్ని గిరిజన ప్రజలకు అందించడం కోసం వారి దగ్గరికి వచ్చి వారిని కర్నూలు తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయించి క్యాంపు కు సహకరించిన కర్నూలు శాంతిరాం ఐ హాస్పిటల్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ శ్రీశైలపతి నాయుడు మాట్లాడుతూ గిరిజనుల కోసం ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేసిన ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ షేక్ ఇస్మాయిల్ కి కృతజ్ఞత తెలుపుతున్నాము అని అన్నారు ఎంతో మందికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడిన ప్రాణదాత ఇస్మాయిల్ అని అన్నారు.స్టేట్ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ చెవుల అంజయ్య మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ప్రాణదాత ఇస్మాయిల్ అని కొనియాడారు ఈ ప్రాంతంలో రక్తం కావాలి అంటే ఏ గ్రూప్ అయినా సరే వెంటనే ఏర్పాటు చేసే ఏకైక వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఇస్మాయిల్ భాయ్ అని అన్నారు అలాగే శాంతిరాం హాస్పటల్ వారికి కూడా కృతజ్ఞతలు తెలిపారు మంద మరియా బాబు మాట్లాడుతూ..గిరిజన ప్రాంతాలలో ఉన్నటువంటి అనేకమందికి ఈ వైద్య శిబిరం ద్వారా ఆరోగ్యపరమైనటువంటి జీవితాన్ని అందించాలని ముస్లింయూత్ అధ్యక్షులు వారు ఈ కార్యక్రమాన్ని తలపెట్టటం చాలా సంతోషకరం పేదరికంతో బాధపడుతూ అట్టడుగు జాతుల వారికి ఇటువంటి కార్యక్రమాలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని వీటి ద్వారా చాలా మంది మెరుగైన ఆరోగ్యాన్ని అందిపుచ్చుకోగలరని ఇటువంటి మంచి కార్యక్రమాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వెంకటాద్రిపాలెం సర్పంచ్ శ్రీశైలపతి నాయుడు, స్టేట్ ఎస్టి కార్పొరేషన్ డైరెక్టర్ చెవుల అంజయ్య, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానేటింగ్ మార్కాపురం డివిజన్ మంద మరియబాబు, వెంకట చెన్నయ్య, నక్క శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు..

# జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాల్లో పాల్గొన్న ఆచార్యులు





**అరకువ్యాలీ, అస్త్రం ప్రతినిధి:** శాస్త్రీయమైన ప్రణాళికలతో విద్యభ్యాసమే మహిళల సాధికారతకు మార్గమని ఆంధ్రప్రదేశ్ జన విజ్ఞాన వేదిక సైన్స్ అండ్ టెక్నాలజీ కన్వీనర్ ఆచార్యులు డాక్టర్ బండంగి రాంప్రసాద్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా అల్లూరి జిల్లా అరకులోయ మహిళా డిగ్రీ కళాశాలలో హిందీ అధ్యాపకులు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు డాక్టర్ బి సుభాన్ అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అంబేద్కర్ కోనసీమ జిల్లా తార డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర ఆచార్యులు, సైన్స్ అండ్ టెక్నాలజీ కన్వీనర్ డాక్టర్ బండంగి రాంప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూశాస్త్రీయమైన విధానాలతో విద్యాభ్యాసం చేస్తే ఉత్తమ ఫలితాలు సులభంగా సాధించవచ్చని, ఉన్నత రంగాల్లో స్థిరపడడానికి ఇదే దోహదం అన్నారు. మహిళలు ఉన్నత విద్యావంతులై రానించినప్పుడే ఆదివాసి ప్రాంతం సంపూర్ణ సాధికారత సాధించగలదని ఉద్ఘాటించారు. కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ జన విజ్ఞాన వేదిక లక్ష్యాలు, ఆశయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులతో పాటు,విద్యార్థులు పాల్గొన్నారు.

# పీవీ సునీల్‌కుమార్ అక్రమ సస్పెన్షన్‌కు నిరసనగా శ్రీకాకుళంలో ధర్నా నిర్వహిస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

### పీవీ సునీల్ కుమార్ సస్పెన్షన్

### ఇది సర్కారు పెద్దల కుట్రేనంటున్న దళిత సంఘాలు




అమరావతి: దళిత అధికారులపై చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు కొనసాగిస్తోంది. ఇప్పటికే సీఐడీ పూర్వపు అదనపు డీజీ సంజయ్‌ని కుట్ర పూరితంగా సస్పెండ్ చేసిన కూటమి ప్రభుత్వం.. పలువురు దళిత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా ఉద్దేశ పూర్వకంగా అవమానిస్తోంది. అయినప్పటికీ చంద్రబాబు ప్రభుత్వ కక్ష చల్లారినట్టు లేదు. అందుకే డీజీ ర్యాంకులో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై తాజాగా కక్ష సాధింపు చర్యలకు తెగబడింది. కనీసం నోటీసు కూడా జారీ చేయకుండా ఆయన్ను ఏకపక్షంగా సస్పెండ్ చేయడం విస్మయ పరుస్తోంది. అనుమతి లేకుండా విదేశీ పర్యటనలు చేశారనే అభియోగాలపై ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రభుత్వం ఆదివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. కానీ పీవీ సునీల్ కుమార్ ప్రభుత్వ ముందస్తు అనుమతితోనే విదేశీ పర్యటన చేశారు. అయినా పీవీ సునీల్ కుమార్ 2019%–%2024 మధ్య పలుసార్లు ప్రభుత్వ అనుమతి లేకుండా అమెరికా తదితర దేశాల్లో పర్యటించారని ప్రభుత్వం ఆరోపించింది. కీలక స్థానాల్లో ఉన్న ఐపీఎస్ అధికారి అనధికారిక విదేశీ పర్యటనలతో సున్నితమైన సమాచారం లీక్ అయ్యే అవకాశం ఉందనే సాకు చూపుతూ క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.  పీవీ సునీల్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఐఉత్తర్వుల్లో వెల్లడించిన కారణాలు పూర్తిగా అవాస్తవం. ఎందుకంటే 2019%–%2024 మధ్య కాలంలో ఆయన విదేశీ పర్యటనలకు ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకున్నారు. ఆ పర్యటనలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యక్తిగత పర్యటనలు కాబట్టి పీవీ సునీల్ కుమార్ తన సొంత ఖర్చుతో విదేశాలకు వెళ్లాలని కూడా పేర్కొంది. అందుకు సమ్మతించి, పూర్తిగా తన సొంత ఖర్చులతో, వ్యక్తిగత హోదాలో ఆయన అమెరికాలో ఉంటున్న కుమారుడిని చూడటానికి వెళ్లారు. అయినా సస్పెండ్ చేయడం కేవలం చంద్రబాబు ప్రభుత్వ కుట్రేనన్నది స్పష్టమవుతోంది. నిబంధనల ప్రకారం నోటీసు జారీ చేసి ఆయన వివరణ కోరాలి. ఆయన ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే అప్పుడు తదుపరి చర్యలు తీసుకోవాలి. కానీ కూటమి ప్రభుత్వం ఈ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోలేదు. ఎందుకంటే పీవీ సునీల్ కుమార్‌కు నోటీసులు జారీ చేస్తే.. తాను ప్రభుత్వ అనుమతితోనే, సొంత ఖర్చులతో విదేశాల్లో పర్యటించానని ఆయన ఆధారాలు సమర్పిస్తూ వివరణ ఇస్తారు. అందుకే ఆయనకు ఆ అవకాశం ఇవ్వకూడదనే ప్రభుత్వం కనీసం నోటీసు జారీ చేయకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేసిందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.  దళిత అధికారి పీవీ సునీల్ కుమార్‌ను టీడీపీ కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా సస్పెండ్ చేసిందని దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ తీరును నిరసిస్తూ అంబేద్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) ప్రతినిధులు, దళిత సంఘాల నేతలు శ్రీకాకుళంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు.

**అస్మదీయులైతే అనుమతి లేకున్నా ఏ దేశానికైనా వెళ్లొచ్చట!**

పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారులు ముందస్తు అనుమతి లేకుండానే విదేశాల్లో పర్యటిస్తున్నారు. వారు తమ విదేశీ పర్యటనల ఫొటోలను సోషల్ మీడియాలో కూడా అప్‌లోడ్ చేస్తున్నారు. అయినా ప్రభుత్వం వారిపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం లేదు.